క్లుప్తంగా

మదనపల్లె ఆర్డీవోగా హరిప్రసాద్

మదనపల్లె : మదనపల్లి ఆర్డీవోగా సి. హరి ప్రసాద్ నియమితులయ్యారు. బుధవారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి... జీవో నంబర్ 219 ప్రకారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మదనపల్లె ఆర్డీవో గా పనిచేస్తున్న ఎంఎస్ మురళిని పోస్టింగ్ కోసం ప్రిన్సిపల్ సెక్రటరీకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశిస్తూ ఆయన స్థానంలో కర్నూలు ఆర్డీవోగా పని చేస్తున్న హరిప్రసాద్ ను మదనపల్లె ఆర్డీవో గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు కార్యకర్తల సమావేశం

గుర్రంకొండ/ వాల్మీకిపురం: వాల్మీకిపురం మండలంలో ఉదయం 9 గంటలకు, గుర్రంకొండ మండలంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ముక్తియార్‌ఆలీఖాన్ తెలిపారు. సమావేశానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుతారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ: కురబలకోట మండలం గోల్డన్‌వ్యాలీ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని బొలేరో ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన మోహన్ (20), మునిరత్నం(20)లు ద్విచక్ర వాహనంలో సొంత పనుల నిమిత్తం బి.కొత్తకోటకు వెళ్లి తిరిగి వస్తుండగా గోల్డన్‌వ్యాలీ కాలేజీ వద్ద ద్విచక్రవాహనాన్ని బొలేరో ఢీ కొంది. ప్రమాదంలో మోహన్, మునిరత్నం గాయపడ్డారు. 108 సిబ్బంది వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బి.కొత్తకోట సీఐగా సూర్యనారాయణ

బి.కొత్తకోట: బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు మొదటి సీఐగా ఎస్.సూర్యనారాయణ నియమితులయ్యారు. సత్యసాయి జిల్లాలో పని చేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ములకలచెరువు ఎస్‌ఐగా తిప్పేస్వామి



ములకలచెరువు: ములకలచెరువు ఎస్ఐగా తిప్పేస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కలకడ మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన గాయత్రి జిల్లా కేంద్రమైన రాయచోటికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడుతానని, అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేస్తానన్నారు.

'పల్లెకు పోదాం' విజయవంతం చేద్దాం

బి.కొత్తకోట: పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతికార్యకర్త సహకరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోరంట్ల రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ఆరర్య వైశ్య కళ్యాణ మండపంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దృష్టి పెట్టుకుని కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల గురించి వివరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, జిల్లా కార్యదర్శి ఎన్.శోభారాణి, మండల అధ్యక్షులు రాందాస్, మురళీ, హరీష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

మదనపల్లె సిటీ: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. బుధవారం స్థానిక టు డిపోలో నిమ్మనపల్లె–కందూరు రూట్‌లో గిఫ్ట్ స్కీమ్ లక్కీ డ్రా తీశారు. మొదటి బహుమతి మమత, రెండవ బహుమతి నరసింహులు, మూడవ బహుమతి హేమకుమారి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో అమ్మ హాస్పిటల్ డాక్టర్ ఎం.సీ.సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

మదనపల్లె సిటీ: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మదనపల్లెకు చెందిన అక్షయ్‌రెడ్డి, పవన్‌నాయుడు ప్రతిభ కనబరిచారు. నియోజకవర్గస్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ డబుల్స్‌లో విజేతలుగా నిలిచారు. వీరికి ట్రోఫీతో పాటు మెడల్స్, రూ.20 వేలు నగదును ఆర్డీవో మురళి అందజేశారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

వాల్మీకిపురం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ప్రధాన మంత్రి టిబి ముఖ్త భారత్ పోషన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా రోగులకు పౌష్టికాహారంను పంపిణీ చేసినట్లు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక వ్యాపారుల సహకారంతో ఒక్కొక్క టిబి వ్యాధిగ్రస్తుడికి ఆరు నెలలకు సరిపడే రూ.700 విలువ చేసే పౌష్టికాహారం ఉచితంగా పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో మురళి, నాగిరెడ్డి, కృష్ణమూర్తి నాయక్, అమృత, గంగరత్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరో మారు ఆశీర్వదించండి

- నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి
- నేరేడికొండ రాయస్వామికి ప్రత్యేక పూజలు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: సంక్షేమ సారథి వైఎస్ జగనన్నను ప్రజలు మరో మారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని జుంజురపెంట పంచాయతీలో వెలసిన నేరేడికొండ రాయస్వామి ఆలయంలో సర్పంచులు భూదేవి, చంద్రాయుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలు, నాయకులు ద్విచక్ర వాహన ర్యాలీతో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గం పాడి పంటలతో కలకలాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని ఎంతో నమ్మకంతో ప్రజలు ఆశీర్వదించి సీఎంను చేయడం మరవలేమన్నారు. అలాగే మరో మారు సీఎంగా చేసుకుందామన్నారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. గతంలో వైఎస్సార్ సీపీకి మెజార్టీ ఇవ్వడంతో తంబళ్లపల్లెపై ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రూ.వేలకోట్లతో ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. విద్యా, వైద్యం సామాన్యులకు అందుబాటులో తెచ్చేలా పెనుమార్పులతో ఇంటికే వైద్యసేవలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదేన్నారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసి, తాగునీటిని ఇంటికి అందించాలని భారీ ప్రాజెక్టుల నిర్మాణం 75 శాతం పనులు పూర్తి చేస్తే టీడీపీ కోర్టులకు వెళ్లి పనులు నిలిచిపోయేలా చేశారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, రామక్రిష్ణ, మల్లికార్జున, శివారెడ్డి, కోటిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణ

ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి స్వగృహంలో బుధవారం ఎన్నికలకు సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. రానున్న ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు అందరూ సంక్షేమ పాలనను గుర్తించి మళ్లీ సీయంగా జగన్‌మోన్‌రెడ్డి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషిచేసి గెలిపించేందుకు సైనికులుగా పనిచేయాలన్నారు.

కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా

కురబలకోట: పార్టీ కార్యకర్తలను గుండెల్లోపెట్టుకుని చూసుకుంటానని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తెట్టు గ్రామ సర్పంచ్ నులక మనోహర్ రెడ్డి తోపులో మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపార్టీకైనా కార్యకర్తలే పునాది అన్నారు. కార్యకర్తలు లేనిదే ఏపార్టీ కూడా మనుగడ సాగించలేదన్నారు. తాను నిత్యం అందుబాటులో ఉంటున్నానన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు చిన్న కష్టం కూడా రానివ్వనన్నారు. జగన్ పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాలు అందాయన్నారు. బైసాని చంద్రశేఖర్ రెడ్డి, బి. దస్తగిరి, నులక మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపర సంజీవని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

- ఉచిత వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన ప్రభుత్వం
- ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ వైద్యం
- 90 శాతం కుటుంబాలు ఆరోగ్యశ్రీతో లబ్ధి
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న నిసార్‌అహ్మద్, మనూజారెడ్డి తదితరులు

మదనపల్లె : పేద కుటుంబాలకు పునర్జన్మ ప్రసాదిస్తున్న అపర సంజీవని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని 14వవార్డులో ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ప్రభుత్వం నూతనంగా ముద్రించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీ చేశారు. కౌన్సిలర్ షబానా, వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఏ.కరీముల్లా ఆధ్వర్యంలో సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతిలకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ పేదవాడు వైద్యం కోసం అప్పుల పాలై, కుటుంబాలు రోడ్డుమీదకు వచ్చి, జీవనప్రమాణాలు క్షీణించకూడదనే ఉద్దేశంతో మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే.. ఆయన కుమారుడిగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగైన వైద్యసేవలు అందేలా తీర్చిద్దారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యపరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ, రాష్ట్రప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ వైద్యాన్ని అందించడంతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులోనూ అధునాతన వైద్యసేవలు పొందేలా ఆరోగ్యశ్రీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేశారన్నారు. కేన్సర్ లాంటి మహమ్మారి బారిన పడిన బాధితులకు పరిమితి లేని చికిత్సలు అందిస్తూ ఆరోగ్యశ్రీ సంజీవనిగా మారిందన్నారు. వార్షిక ఆదాయం రూ.5లక్షలు ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చడంతో రాష్ట్రంలో 90 శాతం కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకువచ్చి ఇంటివద్దకే ఉచితంగా వైద్యసేవలు, మందులు అందించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి, జగనన్న ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా 14వ వార్డులో సుమారు 200 మందికి ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు ముబీనా, సుగుణ, రామిశెట్టిశివయ్య, నాయకులు ఆంజనేయులు, దేవతాసతీష్, సాయిశేఖర్ రెడ్డి, నరిబాబాయ్, రియాజ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చూపుతున్న బాధితులతో ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 15 మందికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.18,77,000 చెక్కులను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించారన్నారు. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ చింతల శివానందరెడ్డి

వాల్మీకిపురం: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేస్తూ పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ జెడ్పీటీసీ చింతల శివానంద రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చింతపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న 73 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. అత్యుత్తమ బైజూస్ కంటెంట్‌తో కూడిన నాణ్యమైన ట్యాబ్‌లను విద్యార్థులకు అందించడం ద్వారా రాష్ట్ర విద్యారంగంలోనే విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. ఒక్కొక్క ట్యాబ్ ధర రూ.16,500 అని, బైజూస్ కంటెంట్ వెల రూ.15,500 అని తెలిపారు. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ ద్వారా పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఈ ట్యాబ్‌లు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండా కంటెంట్ చదువుకునే వెసులుబాటు ఈ ట్యాబ్‌లలో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి రమేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, మోహన్‌రెడ్డి, కిరణ్ కుమార్, ఆనంద, శ్రీరాములు, ఫారుఖ్, విష్ణుప్రియ, ముబారక్, చెంగల్‌రెడ్డి, శ్రీనివాసులు, హర్షద్, హెచ్‌ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

కలకడ : మండలంలోని ముడియంవారిపల్లెలో సర్పంచ్ శాంతమ్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కుష్టు నివారణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే ఉచిత మందుల ద్వారా స్పర్శలేని మచ్చల నుంచి పూర్తి విముక్తి కలుగుతుందని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ శాంతమ్మ అన్నారు. కుష్టువాధి వ్యాప్తి వలన చేతివేళ్ళు ముడుచుకు పోవడం, కంటిచూపు కోల్పోవడం, బొబ్బలు రేగి కాళ్ళు పుండ్లు అవుతాయన్నారు. ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, ఎంపిహెచ్‌ఈఓ జయరామయ్య, సిబ్బంది వెంకటేశ్వరరావు, నజీర్‌అహమ్మద్, లిఖిత్, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో సత్తా



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జనవరి 28 నుంచి 30 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో భాగంగా వారు మూడు బంగారు పతకాలు, ఐదు కాంస్య పతకాలు, ఐదు రజిత పతకాలు సాధించారు. పాఠశాలలో బుధవారం విద్యార్థులను అభినందన సభ ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రోప్‌స్కిప్పింగ్‌లో రాణించడం అభినందనీయమన్నారు. వారికి మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , పీడీలు సుధాకర్, అన్సర్, దేవకమ్మ, జలజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు



రెడ్డెప్పరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె పీహెచ్‌సీలో ఆఫ్తాలమిస్ట్ వైద్యులు రెడ్డెప్పరెడ్డి, సీహెచ్‌వోగా సుమతిలు అందించిన సేవలు మరుపురానివని, ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసిన సేవలే గుర్తింపు తెస్తాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీలక్ష్మీ తెలిపారు. బుధవారం వారు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను అందించి వారికి చేసిన సేవలు అమోఘమన్నారు. అనంతరం రెడ్డెప్ప దంపతులను, సుమతి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అనుపమ, ఆశాలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ జీవితమే ఓ పోరాటం

మదనపల్లె : పోరాటమే జీవితం... జీవితమే పోరాటంగా జీవనయానం సాగించిన విప్లవకారుడు గద్దర్ అని, బడుగు వర్గాల అభ్యున్నతికై తుది శ్వాస వరకు ఆయన చేసిన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ అన్నారు. బుధవారం వీసీకే పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) సంయుక్తంగా గద్దర్ జయంతిని నిర్వహించాయి. ఈసందర్భంగా వీసీకే, బాస్ ప్రతినిధులు, గద్దరన్న అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప మాట్లాడుతూ అసమానతలపై యుద్ధానికి సాయుధ దళమై, సాంస్కృతిక గళమై సమరశంఖం పూరించిన గొప్ప విప్లవ యోధుడు గద్దర్ అని కొనియాడారు. అనంతరం పీటీయం శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజల పాటకు కొత్త ఒరవడిని అందించి, దానికి శ్రమ సౌందర్యాన్ని అద్ది, విముక్తి పోరాటానికి వీరులను అందించిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ అని చెప్పారు. తుదిశ్వాస వరకూ తన జీవితం మొత్తాన్ని సమాజ మార్పు కోసం అంకితం చేసిన గద్దర్ చిరస్మరణీయుడని చెప్పారు. గద్దర్ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఉద్యోగులు మునివెంకటప్ప, ఉత్తన్న, అంజప్ప, మాజీ నక్సలైట్ నాయకులు పాదం శివన్న, ఆటో శ్రీరాములు, ఈశ్వర్ రెడ్డి, వివేకానంద ఆశయం ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, భాను లతోపాటు వీసీకే, బాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జడ్జి ప్రశాంత్‌కు సన్మానం



ప్రశాంత్‌ను సన్మానిస్తున్న బాస్ నాయకులు

పీలేరు రూరల్ : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్ ఎస్సీ కాలనీకి చెందిన రిటైర్డ్ ఏపీపీ పల్లెపాగు శ్రీనాథ్ కుమారుడు పల్లెపాగు ప్రశాంత్ ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నికైన విషయం విదితమే. బుధవారం భారతీయ అంబేడ్కర్ సేన, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తిరుపతిలో ప్రశాంత్‌ను ఆయన నివాసంలో కలసి ఘనంగా సన్మానించారు. బాస్ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, మల్లెమొగ్గల ఉమాపతి మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పుట్టి, ఉన్నత చదువులు చదివి ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి జడ్జిగా నియామకం కావడం ఎస్సీ, బహుజన వర్గాల ప్రజలు గర్వించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో బాస్ నాయకులు చౌడప్ప, యువరాజ్, గణేష్, జగదీష్, బీసీ నాయకులు శివశంకర్, యోగి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా కోసం పోలీసుల గాలింపు

ములకలచెరువు: మండలంలోని మద్దినాయునిపల్లి సమీపంలోని సంద్రదవి అటవీ ప్రాంతంలో మంగళవారం పట్టుబడిన గంజాయి ముఠా సభ్యుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ములకలచెరువు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తమ్మిశెట్టి మధు నేతృత్వంలో పట్టుబడిన నిందితుల నుంచి సేకరించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలంలో పారిపోయిన నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచారు. పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి గంజాయి నిందితుల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విస్తృతంగా గాలిస్తున్నట్లు సమాచారం. అలాగే ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడా గంజాయి అక్రమంగా తరలిస్తున్నారనే అనుమానంతో కూడా పోలీసులు అన్ని కోణాల్లో కూపీ లాగుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి కీలక ముఠా కేసును ఛేదించేందుకు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కురబలకోట: మండలంలోని అంగళ్లులో నజ్మా అనే మహిళ కర్ణాటకకు చెందిన టెట్రా మద్యం ప్యాకెట్లు విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఆమె వద్ద నుంచి రూ.5 వేలు విలువ చేసే 50 ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి బుధవారం రిమాండుకు పంపినట్లు తెలిపారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ మృతికి నివాళి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లికి చెందిన క్రిష్టారెడ్డి (74) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈయన గతంలో జెడ్పీటీసీగా, ఏఎంసీ చైర్మన్‌గా పనిచేశారు. పార్టీలకతీతంగా నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

వేలం వాయిదా

గుర్రంకొండ: రెడ్డెమ్మతల్లి ఆలయంలో తలనీలాల సేకరణ వేలం వాయిదా పడినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మంజుల తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఆలయ కార్యాలయంలో భక్తుల తలనీలాలను ఏడాది పాటు సేకరించే హక్కు కోసం వేలం నిర్వహించగా పాటదారులు రాక పోవడంతో వాయిదా వేశామన్నారు.

స్కిల్స్ ఉంటే ఉద్యోగాలే వెంటపడతాయ్

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: స్కిల్స్ ఉంటే ఉద్యోగాలే వెంటపడతాయని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని విశ్వం కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి ఉద్యోగం కావాలని ఆకాంక్షిస్తారన్నారు. అయితే కష్టపడి చదివిన వారు మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. చదువుపై శ్రద్ధ ఉన్న వారు అనుకున్నది సాధిస్తారన్నారు. ప్రతిభ ఉన్న వారికి ఉద్యోగాలకు కొదువ లేదన్నారు. ఎక్కడైనా రాణించగలుగుతారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జాబ్‌మేళాకు అభ్యర్థులు హాజరయ్యారు.